www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

మంగళవారం
20.10.2026



- సమ్మిట్ ఏర్పాట్లు వేగవంతం చేయాలి
- నవంబర్ నాటికి పనులు పూర్తి
- పెట్టుబడులకు తెలంగాణ సురక్షితం
- అంతర్జాతీయ స్థాయిలో సదస్సు నిర్వహణ

రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చే సదస్సు

5లో..



తెలంగాణ ఆర్థిక, పారిశ్రామిక భవిష్యత్తుకు సరికొత్త దిశానిర్దేశం చేసేందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహణకు ముహూర్తం ఖరారైంది. భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా డిసెంబర్‌లో జరగనున్న ఈ అంతర్జాతీయ సదస్సు ఏర్పాట్లను స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పనులన్నీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశిస్తూ పారిశ్రామిక ప్రగతికి సరికొత్త రోడ్‌మ్యాప్ సిద్ధం చేశారు.

దసరా శుభాకాంక్షలు

- సంస్కృతి సంప్రదాయాలకు దసరా ప్రతీక
- ఎన్ని కష్టాలొచ్చినా ధర్మానిదే విజయం
- అధర్మంపై ప్రజలు గెలుపొందడం ఖాయం
- ప్రజా జీవితాల్లో వెలుగులు నిండాలి
- బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్



తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయాల్లో దసరాకు విశిష్ట స్థానం ఉందని పేర్కొన్నారు. విజయానికి సంకేతమైన జమ్మి వృక్ష పూజ, శుభసూచకమైన పాలపిట్ట దర్శనం, అలయ్ బలయ్ ప్రేమాభిమానాలు, జమ్మి ఆకును బంగారంగా పంచుతూ పెద్దల ఆశీర్వాదం తీసుకునే మహోన్నత సంప్రదాయాన్ని ఈ పండుగ అందిస్తోందని చెప్పారు. ఈ ప్రాధాన్యతను గుర్తించే గత బీఆర్ఎస్ ప్రభుత్వం జమ్మి చెట్టును రాష్ట్ర వృక్షంగా, పాలపిట్టను రాష్ట్ర పక్షిగా ప్రకటించిందని గుర్తుచేశారు.





సిద్ధిధాత్రి రూపంలో బాసరసరస్వతిమాత

కలంజ్యోతి, నిర్మల్(అక్టోబర్ 19) : దసరా నవరాత్రులలో భాగంగా సోమవారం తొమ్మిదవ రోజు బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని సిద్ధిధాత్రీ దేవి గా అలంకరించారు. సిద్ధి అంటే ఒక పని సిద్ధించడం, ధాత్రీ అంటే ఇచ్చేది. భక్తులు కోరే పనిని తీర్చే అమ్మవారుగా భావిస్తారు. ఇహ సుఖాలనే కాక, జ్ఞానాన్నీ, మోక్షాన్నీ కూడా సిద్ధిధాత్రీదేవీ ప్రసాదించగలదని విశ్వసిస్తారు. తామర పువ్వులో కూర్చుని ఉండే సిద్ధిధాత్రీ దేవికి నాలుగు చేతులు ఉంటాయి. కమలం,గద సుదర్శన చక్రం,శంఖం ఉంటాయి. ఈ అమ్మవారిని ఆరాధించేవారికి బ్రహ్మజ్ఞానం లభిస్తుందని భావిస్తారు. అమ్మవారికి పరమాన్నం నైవేద్యంగా సమర్పించారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
2
మంగళవారం 20.10.2026
www.kalamjyothi.com





కాఫర్‌డ్యామ్ నిర్మించకపోతే ఆందోళన

- కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించిన కవిత
- మేడిగడ్డను చూపి రైతులను నష్టపరచవద్దు
- సాగునీరందించి రైతాంగాన్ని ఆదుకోవాలి
- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

కలంజ్యోతి, కన్నెపల్లి (అక్టోబర్ 19) : కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని కన్నెపల్లి లక్ష్మీ పంప్‌హౌస్‌ను తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నవంబర్ నెలాఖరు నాటికి ప్రాణహిత నీటిని ఎత్తిపోసేందుకు వీలుగా వెంటనే కాఫర్‌డ్యామ్‌ను నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో కన్నెపల్లి పంప్‌హౌస్ వద్దే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కరవు పరిస్థితుల్లోనూ అందుబాటులో ఉన్న సాగునీటిని రైతులకు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని తీవ్రస్థాయిలో విమర్శించారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం..

మేడిగడ్డ బ్యారేజీని ఒక భూతంగా చూపిస్తూ రైతులను తీవ్రంగా నష్టపరచవద్దని ప్రభుత్వానికి సూచించారు. తమ పార్టీ కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, రైతు ప్రయోజనాల కోసం ప్రభుత్వానికి స్పష్టమైన పరిష్కార మార్గాలను కూడా చూపుతోందని స్పష్టం చేశారు. టీవీల్లో కనిపించడం కోసం కాకుండా, ప్రజా సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలనే ఏకైక లక్ష్యంతోనే తాము క్షేత్రస్థాయిలో పోరాడుతున్నామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సూచనలను తీవ్రంగా పరిగణనలోకి తీసుకుని రైతాంగ ప్రయోజనాల కోసం చిత్తశుద్ధితో పనిచేయాలని డిమాండ్ చేశారు.

నీటిని ఒడిసిపట్టడంలో నిర్లక్ష్యం వీడాలి..

గోదావరి, ప్రాణహిత నదుల ద్వారా సముద్రంలోకి వృథాగా పోతున్న జలాలను కాపాడి రిజర్వాయర్లకు తరలించాల్సిన బాధ్యత పాలకులపై ఉందని ఆమె పేర్కొన్నారు. తాత్కాలిక మరమ్మతులు, ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా రైతులకు తక్షణమే సాగునీరు అందించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని వివరించారు. పాలకులు రాజకీయ లబ్ధి కోసం కాలయాపన చేయకుండా, ప్రాజెక్టును సమర్థవంతంగా వినియోగంలోకి తెచ్చి అన్నదాతలకు భరోసా కల్పించాలని, లేని పక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.



కార్యకర్తలకు అండగా ఉంటా

రాజకీయ కక్షసాధింపు చర్యలను ఎదుర్కొంటాం

మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ : కష్టకాలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఇటీవల ఓ కేసులో అరెస్టై బెయిల్‌పై విడుదలైన మాజీ జడ్పీటీసీ చికొండ్ర శ్రీశైలంను సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన పరామర్శించారు. శ్రీశైలం యోగక్షేమాలను అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా మర్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ, రాజకీయ కక్షసాధింపులో భాగంగానే శ్రీశైలంపై అక్రమ కేసులు నమోదు చేశారని ఆరోపించారు. రాజకీయాల్లో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా అధైర్యపడవద్దని తెలిపారు. న్యాయవ్యవస్థపై తమకు పూర్తి నమ్మకం ఉందని, చట్టపరంగానే పోరాడి న్యాయం సాధిస్తామని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఆయన పేర్కొన్నారు.



కన్నెపల్లి పంప్‌హౌస్ సమస్యను పరిష్కరించాలి

- 93 మీటర్లకు పైగా కాఫర్‌డ్యాం నిర్మించాలి
- రెండు టీఎంసీల నీరు వృథాగా పోతోంది
- నిర్లక్ష్యం వీడకపోతే ఉద్యమం తప్పదు
- టీఆర్ఎస్ నేత డాక్టర్ అనిల్‌కుమార్

కలంజ్యోతి, కన్నెపల్లి (అక్టోబర్ 19) : కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్‌హౌస్ సమస్యకు ప్రభుత్వం తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలని టీఆర్ఎస్ శ్రేణులు డిమాండ్ చేశాయి. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బాధ్యులు అనిల్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో కన్నెపల్లి పంప్‌హౌస్‌కు తరలివెళ్లారు. ప్రాజెక్టు పరిధిలో తలెత్తిన సమస్యల వల్ల రైతాంగానికి సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పాలకులు నిర్లక్ష్య వైఖరి వీడి వెంటనే సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

కాఫర్‌డ్యాం నిర్మిస్తే సాగునీటి కష్టాలు తీరుతాయి..

కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద 93 మీటర్లకు పైగా కాఫర్‌డ్యాం నిర్మిస్తే సమస్యను సులభంగా పరిష్కరించే అవకాశం ఉందని అనిల్‌కుమార్ నాయక్ స్పష్టం చేశారు. ఈ నిర్మాణం చేపట్టడం ద్వారా మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ఎలాంటి సాగునీటి సమస్యలు తలెత్తకుండా సమర్థవంతమైన చర్యలు తీసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే సాంకేతిక చర్యలు ప్రారంభించాలని కోరారు.

నవంబర్ నెలాఖరులోగా నిర్మాణం చేపట్టాలి..

కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద టీఆర్ఎస్ నాయకురాలు కవిత మాట్లాడుతూ, నవంబర్ నెలాఖరులోగా ప్రభుత్వం కాఫర్‌డ్యాం నిర్మాణాన్ని చేపట్టకపోతే పంప్‌హౌస్ వద్దే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. మేడిగడ్డ బ్యారేజీతో సంబంధం లేకుండానే కన్నెపల్లి నుంచి అన్నారం, సుందిళ్లకు నీటిని నేరుగా ఎత్తిపోసే అవకాశాలు ఉన్నాయని, ఆ నీటితో ఆయా ప్రాజెక్టులను సులభంగా రీఛార్జ్ చేసుకోవచ్చని ఆమె సూచించారు.

రూ.25 కోట్లతో నెలన్నరలోనే పూర్తి చేయొచ్చు..

ఈ పనుల కోసం సుమారు రూ.25 కోట్లు వెచ్చిస్తే కేవలం నెలన్నర రోజుల వ్యవధిలోనే పూర్తి చేయవచ్చని కవిత తెలిపారు. ఎల్‌నినో ప్రభావం వల్ల రాబోయే ఏడాది వర్షాలు ఎలా ఉంటాయో తెలియని అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయని గుర్తుచేశారు. ప్రస్తుతం మన కళ్ల ముందే ప్రతి రోజూ సుమారు 2 టీఎంసీల గోదావరి జలాలు సముద్రం పాలవుతూ వృథాగా పోతున్నా ప్రభుత్వం వినియోగించుకోలేకపోవడం బాధాకరమన్నారు.

ప్రజాక్షేత్రంలో పోరాటానికి కార్యకర్తల సన్నద్ధం..

రైతాంగ ప్రయోజనాల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు క్షేత్రస్థాయిలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు సందీప్, నరేష్, మహేందర్, లచ్చిరాం, గోపి, కమలహాసన్, కిరణ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



గీతా కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలి

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 19) : ఈత చెట్టుపై నుంచి జారిపడి మరణించిన గీతా కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని గౌడ సంక్షేమ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామానికి చెందిన గీత కార్మికుడు గున్నాల ఎల్లయ్య (60) ప్రమాదవశాత్తు ఈత చెట్టుపై నుండి శుక్రవారం (16102026) రోజున జారిపడి తీవ్రంగా గాయపడ్డారు. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఆయనను సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారని పదిర గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఆ నిరుపేద కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న ఎల్లయ్య మృతితో ఆయన భార్య, ఇద్దరు పిల్లలు అనాథలుగా మారి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కేకే మహేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయాల చైర్మన్ సత్యనారాయణ గౌడ్‌లకు గౌడ సంక్షేమ సంఘం నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, వెంకటస్వామి గౌడ్, మల్లేశం గౌడ్, మహేందర్ గౌడ్, ఎల్లా గౌడ్ విజ్ఞప్తి చేశారు.

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

3

మంగళవారం 20.10.2026

www.kalamjyothi.com



ఛత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణ కమిటీ ఎన్నిక

అధ్యక్షుడిగా ఆగపాటి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా పృథ్వీరాజ్

కలంజ్యోతి, సంగెం (అక్టోబర్ 19) : మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనే సంకల్పంతో గ్రామ యువకులు సమావేశమై విగ్రహ నిర్మాణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదర్శవంతమైన పరిపాలనతో హిందూ సామ్రాజ్యాధిపతిగా చరిత్రలో నిలిచిన శివాజీ మహారాజ్ విగ్రహాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని కమిటీ నిర్ణయించింది. గ్రామ సర్పంచ్ పేర్ల లలిత రమేష్, ఉపసర్పంచ్ ఆగపాటి రాజు అధ్వర్యంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎంపిక చేశారు. కమిటీ అధ్యక్షుడిగా ఆగపాటి రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా తాడికొండ భరత్, మెట్టుపల్లి అనిల్, ప్రధాన కార్యదర్శిగా పేరాల పృథ్వీరాజ్, సహాయ కార్యదర్శులుగా రావుల వరుణ్, రొట్టె రాకేష్, కోశాధికారిగా పులి రాజశేఖర్, సహాయ కోశాధికారులుగా మునుకుంట్ల రాము, నాలం శేఖర్, మునుకుంట్ల రవి, కార్యనిర్వహణ కన్వీనర్‌గా మునుకుంట్ల మధుకర్, మీడియా కన్వీనర్లుగా మండ కృష్ణ, కోడూరి రాహుల్, రాకేష్, వికాస్, పవన్, సాయి, కార్యవర్గ సభ్యులుగా ప్రశాంత్, రమేష్, రాజశేఖర్, నాగరాజు, వేణు, అనిరుద్, కిరణ్, మెట్టిపల్లి అనిల్, కోతి కార్తీక్, నంగునూరు శివ, గుండేడి ప్రశాంత్, రాయపురం అనిల్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కందగట్ల నరహరి, వార్డు సభ్యులు మల్లికార్జున్, సందీప్, సాగర్, కృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ కోటేశ్వర్, సొసైటీ డైరెక్టర్ నలదిగల రవి, మునుగుంట్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు. శివాజీ మహారాజ్ విగ్రహ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ఘనంగా ఆవిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.



వెట్టిచాకిరీ నిర్మూలనకు సమష్టి కృషి

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 19) : వెట్టిచాకిరీ నిర్మూలనకు అధికారులు సమన్వయంతో కృషి చేస్తూ కార్మికుల హక్కులు, చట్టాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా వెట్టిచాకిరీ నిర్మూలన, కార్మికుల హక్కులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన స్వేచ్ఛారథం ప్రచార వాహనాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెట్టిచాకిరీ వల్ల కలిగే అనర్థాలు, దాని నిర్మూలనకు ఉన్న చట్టాలు, కార్మికులకు కల్పించిన హక్కులపై నాటికలు, పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో పర్యటించే ఈ రథం ద్వారా వ్యవసాయ రంగం, ఇటుక బట్టీలు, మైనింగ్, క్వారీలతో పాటు ఇతర రంగాల్లో పనిచేసే అసంఘటిత కార్మికులకు తమ హక్కులపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. వెట్టిచాకిరీకి గురైన వారు, అలాంటి ఘటనలను గుర్తించిన వారు వెంటనే ఫిర్యాదు చేసేలా ప్రజలకు చైతన్యం తీసుకురావాలన్నారు. టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 08069434343 ను విస్తృతంగా ప్రచారం చేయాలని పేర్కొన్నారు. అనంతరం వెట్టిచాకిరీ నిర్మూలనకు సంబంధించిన గోడప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెట్టిచాకిరీ నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, కార్మిక శాఖ అధికారి రాజలింగం, ప్రచార రథం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కళ తప్పిన మినీ ట్యాంక్‌బండ్

- లక్షలు ఖర్చు చేసినా దసరా వేడుకల్లో కనిపించని వైభవం
- నిర్వహణ తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- ఏడేండ్ల నాటి సందడి ఏమైందంటూ నిలదీత
- నిధుల లెక్కలపై సమగ్ర విచారణ చేపట్టాలంటున్న ప్రజలు
- మళ్లీ తెరపైకి మర్రి పేరు..



కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (అక్టోబర్ 19) : జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్‌బండ్‌పై దసరా వేడుకలు ఈసారి కళ తప్పాయన్న విమర్శలు తీవ్రస్థాయిలో వినిపిస్తున్నాయి. గత ఏడేళ్లుగా విద్యుత్ దీపాలంకరణలు, ప్రత్యేక ఏర్పాట్లు, ప్రజల సందడితో కళకళలాడిన మినీ ట్యాంక్‌బండ్ ఈసారి బోసిపోయిందని స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వివిధ మండలాల నుంచి కుటుంబాలతో తరలివచ్చే మహిళలు, యువతకు ఈసారి వేడుకలు తీవ్ర నిరాశను మిగిల్చాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రూ.15 లక్షల వ్యయంపై చర్చ..

దసరా వేడుకల కోసం మున్సిపాలిటీ నుంచి రూ.10 లక్షలు, ప్రజాప్రతినిధి సొంతంగా రూ.5 లక్షలు వెచ్చించినట్లు ప్రచారం జరుగుతోంది. మొత్తం రూ.15 లక్షలు ఖర్చు చేసినప్పటికీ గతంలో కనిపించిన స్థాయిలో విద్యుత్ దీపాలంకరణలు, ఏర్పాట్లు లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాధనం భారీగా వెచ్చిస్తున్నప్పుడు అందుకు తగిన ఏర్పాట్లు ఎందుకు చేయలేకపోయారన్న చర్చ పట్టణంలో విస్తృతంగా సాగుతోంది.

టెండర్ల వ్యవహారంలో ఆరోపణలు..

గతంలో హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా నిపుణులను రప్పించి ఆకర్షణీయమైన లైటింగ్ ఏర్పాటు చేసేవారని స్థానికులు గుర్తుచేస్తున్నారు. ఈసారి టెండర్ల కేటాయింపు, పనుల అప్పగింత విషయంలో ఏం జరిగిందనే చర్చ మొదలైంది. గతంలో పనులు చేసిన వారికే అవకాశం ఇచ్చారా, లేక ఇతరులకు అప్పగించారా అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. పనుల కేటాయింపులో కొందరి వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు పూర్తి వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

సమన్వయ లోపంతో ఆశించిన స్పందన కరవు..

ప్రజలను ఆకట్టుకునేలా వేడుకలు నిర్వహించేందుకు స్థానిక నాయకులు, నిర్వాహకులు సమన్వయంతో పనిచేయలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎమ్మెల్యే సొంత నిధులు వెచ్చించినట్లు చెబుతున్నప్పటికీ వేడుకలకు ఆశించిన స్థాయిలో ఆదరణ లభించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రజాప్రతినిధి ప్రతిష్ఠను పెంచేలా కార్యక్రమాలు నడిపించడంలో ద్వితీయ శ్రేణి నాయకత్వం విఫలమైందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

పూర్వ వైభవానికి సమర్థ నిర్వహణ అవసరం..

దసరా వేడుకల కోసం ఖర్చు చేసిన నిధులు, టెండర్ల కేటాయింపు, పనుల నాణ్యతపై సమగ్ర వివరాలు వెల్లడించాలని పట్టణ ప్రజల నుంచి డిమాండ్లు వస్తున్నాయి. ఏటా వేలాది మందిని ఆకర్షించే మినీ ట్యాంక్‌బండ్‌కు పూర్వ వైభవం తీసుకురావాలంటే కేవలం నిధుల కేటాయింపు మాత్రమే సరిపోదని, సమర్థమైన నిర్వహణ కూడా అత్యంత ఆవశ్యకమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మళ్లీ తెరపైకి మర్రి పేరు..

దసరా వేడుకల నిర్వహణపై నెలకొన్న అసంతృప్తి నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి పేరు మరోసారి స్థానిక రాజకీయ చర్చల్లో ప్రధానంగా వినిపిస్తోంది. ఆయన హయాంలో మినీ ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేవని ఆయన అభిమానులు గుర్తుచేస్తున్నారు. ఆ కార్యక్రమాల విజయానికి నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా శ్రమించేవారని చెబుతున్నారు. గత వైభవాన్ని గుర్తుచేసుకుంటూ మర్రి ఉంటే వేడుకలు మరింత ఘనంగా జరిగేవని ఆయన మద్దతుదారులు పేర్కొంటున్నారు.



ఆలయ కమిటీకి రూ. 21 వేల విరాళం



దుర్గామాతకు ప్రత్యేక పూజలు

కలంజ్యోతి, శివంపేట (అక్టోబర్ 20) : శివంపేట మండల కేంద్రంలోని రామాలయం ప్రాంగణంలోని దుర్గామాత ఆలయంలో మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పులిమామిడి నవీన్ గుప్తా అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దుర్గామాత ఉత్సవ కమిటీ నిర్వాహకులకు తన వంతు సహాయంగా 21 వేల రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
మంగళవారం 20.10.2026
4
www.kalamjyothi.com



ఉగాండాలో సద్దుల బతుకమ్మ సంబురాలు

- భావితరాలకు సంస్కృతిని అందిస్తాం
- సంప్రదాయాలను కాపాడటం మన బాధ్యత
- తెలంగాణ అసోసియేషన్ ఉగాండా

ఉగాండా దేశం కంపాలాలోని శ్రీసప్తగిరి వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. రెండు తెలుగు రాష్ట్రాల ప్రవాసులు భారీగా తరలివచ్చి తీరొక్క పూలతో బతుకమ్మలను కొలిచి లయబద్ధంగా ఆడిపాడారు. ప్రాంతాలకు అతీతంగా తెలుగు వారంతా ఒక్కటేననే ఐక్యతను చాటుతూ పరస్పర ఆత్మీయతను పంచుకున్నారు. విదేశీ గడ్డపై మన సంస్కృతి, సాంప్రదాయాల గొప్పతనాన్ని భావితరాలకు అందిస్తూ పండుగను ఘనంగా నిర్వహించారు.

కలంజ్యోతి బ్యూరో (అక్టోబర్ 20) : ఉగాండా గడ్డపై సద్దుల బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. తెలంగాణ అసోసియేషన్ ఉగాండా ఆధ్వర్యంలో కంపాలాలోని కిటెండే ప్రాంతంలో ఉన్న శ్రీ సప్తగిరి వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఈ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తెలుగు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను మహిళలు భక్తిశ్రద్ధలతో కొలిచి, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ లయబద్ధంగా ఆడిపాడారు. మహిళల ఆటపాటలతో ఆలయ ప్రాంగణం అంతా పండుగ శోభతో వెల్లివిరిసింది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయత, ఆనందం, ఐక్యత ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఒక్కటే..

రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రవాసులు పరస్పర సహకారంతో పాల్గొని ప్రాంతాలకు అతీతంగా తెలుగు వారందరూ ఒక్కటేననే సందేశాన్ని చాటారు. బతుకమ్మ పండుగ విశిష్టతను, ప్రకృతితో మానవ జీవనానికి ఉన్న అనుబంధాన్ని, పూల పండుగ వెనుక దాగున్న సాంస్కృతిక విలువలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. శ్రీ సప్తగిరి వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో భక్తి, సంప్రదాయం, సోదరభావం కలగలిసిన వాతావరణం కనిపించింది. మహిళలు, యువత, చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేశారు.

భావితరాలకు సంస్కృతిని అందిస్తాం..

విదేశీ గడ్డపై ఉన్నప్పటికీ మన తెలుగు సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడం, భారతీయ సంస్కృతిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని నిర్వాహకులు పేర్కొన్నారు. ఉగాండాలో నివసిస్తున్న తెలుగు ప్రజల మధ్య సాంస్కృతిక ఐక్యతను మరింత బలోపేతం చేయడంలో ఇలాంటి వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని అసోసియేషన్ ప్రతినిధులు స్పష్టం చేశారు. తెలంగాణ అసోసియేషన్ ఉగాండా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సద్దుల బతుకమ్మ ఉత్సవాలు తెలుగు సంస్కృతి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసేలా నిలిచాయని కొనియాడారు.















కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
5
మంగళవారం 20.10.2026
www.kalamjyothi.com



పోలీసు హెడ్ క్వార్టర్స్ లో ఆయుధ పూజ

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 19) : దసరా నవరాత్రుల సందర్భంగా నిర్మల్ జిల్లా ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆయుధపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ ఎస్పీ డా. జి. జానకి షర్మిల పాల్గొని పోలీస్ ఆయుధాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోలీస్ వాహనాలకు వాహనపూజ చేశారు. ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ప్రాంగణంలో జమ్మి మొక్కను నాటారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దసరా నవరాత్రులలో భాగంగా సంప్రదాయ బద్ధంగా నిర్వహించే ఆయుధపూజ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. పోలీస్ శాఖలో ఆయుధాలు, వాహనాలు విధి నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సమృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పేద మహిళలకు చీరల పంపిణీ

కలంజ్యోతి, శివంపేట్ (అక్టోబర్ 20) : దసరా పండుగను పురస్కరించుకుని పేద మహిళలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. శివంపేట మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పులిమామిడి నవీన్ గుప్తా పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన సొంత నిధులతో సుమారు వెయ్యి చీరలను పేద మహిళలకు దసరా కానుకగా అందజేయడం జరిగిందని తెలిపారు. నిరుపేదలకు అండగా నిలిచేందుకు తన వంతుగా నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడతానని ఆయన పేర్కొన్నారు. పండుగ వేళ తమకు చీరలు అందజేసి ఆదుకున్నందుకు మహిళలు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు.



ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠకు విరాళం

ఆలయ అభివృద్ధికి రూ. 50 వేలు అందజేత

కలంజ్యోతి, శివంపేట్ (అక్టోబర్ 19) : మండల కేంద్రంలోని పురాతన కోదండ రామస్వామి ఆలయ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి శివంపేట్ మాజీ జడ్పీటీసీ మహేష్ గుప్తా తన సొంత నిధుల నుంచి 50 వేల రూపాయల విరాళాన్ని అందజేశారు. ఇటీవల ఆలయ ధ్వజస్తంభం ధ్వంసం కావడంతో దాని పునఃప్రతిష్ఠ కోసం ఈ ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ మొత్తాన్ని శర్మకు అందజేసినట్లు మహేష్ గుప్తా తెలిపారు. ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఆయన పేర్కొన్నారు.

అనాథగా మారిన చిన్నారి

- దాతల సహకారంతో అంత్యక్రియలు పూర్తి
- తల్లి చితికి నిప్పుపెట్టిన బాలిక
- ఆదుకోవాలని దాతలకు బంధువుల విజ్ఞప్తి





కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 19) : నాలుగేళ్ల క్రితం తండ్రి మృతి చెందగా, తల్లి పెంపకంలో పెరుగుతున్న ఆ చిన్నారికి తల్లి కూడా దూరమై అనాథగా మారింది. తల్లిదండ్రుల మరణంతో దిక్కుతోచని స్థితికి చేరిన భైంసా పట్టణంలోని గణేష్ నగర్ కాలనీకి చెందిన కనికరం అవళికకు మానవతావాదులు అండగా నిలిచారు. అనారోగ్యంతో మృతి చెందిన తల్లి అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించారు. దాతల సాయంతో మేదరి కుల సంఘ సభ్యులు, ఐక్యత సేవా సమితి శ్రేణులు బాలిక తల్లి కనికరం గంగామణి అంత్యక్రియలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అవళిక తన మేనమామతో కలిసి తల్లి అంత్యక్రియల తంతు పూర్తి చేసి చితికి నిప్పుపెట్టింది.

కంటతడి పెట్టించిన చిన్నారి రోదన..

నాలుగేళ్ల క్రితం భర్త మరణించిన తర్వాత తల్లి గంగామణి కూతురు అవళికను అన్నీ తానై అల్లారుముద్దుగా పెంచింది. చివరికి తల్లి కూడా అనారోగ్యంతో కన్నుమూయడంతో ఆ చిన్నారి జీవితంలో తీరని విషాదం నిండింది. దిక్కుతోచని స్థితిలో అవళిక తల్లి మృతదేహంపై పడి రోదించిన తీరు స్థానికులను తీవ్రంగా కలిచివేసింది. కన్నీరుమున్నీరై విలపించిన బాలికను ఓదార్చడం ఎవరి వల్లా కాలేదు. స్మశానవాటికలో తల్లిని చివరి చూపు చూస్తూ చిన్నారి రోదించడం అక్కడి వారందరినీ కంటతడి పెట్టించింది. బంధువులు బాలికను సముదాయిస్తూ అంత్యక్రియల క్రతువును ముగించారు.

ఆదుకోవాలని దాతలకు విజ్ఞప్తి..

చిన్నారి మేనమామ కూడా నిరుపేద కావడంతో బాలిక భవిష్యత్తు కోసం దాతల సహాయాన్ని కోరుతున్నారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మిగిలిన ఈ చిన్నారికి అండగా నిలవాలనుకునే దాతలు 9505636773 నంబర్‌కు షేర్ల గంగాధర్ పేరిట ఫోన్‌పే ద్వారా ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని బంధువులు వేడుకుంటున్నారు.



పోలీస్ కుటుంబాల ఆత్మీయ బతుకమ్మ సంబురాలు

జిల్లా జడ్జి శ్రీవాణితో వేడుకలను ప్రారంభించిన ఎస్పీ డా. జి. జానకి షర్మిల

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 19): పోలీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్పీ డా. జి. జానకి షర్మిల తో కలిసి వేడుకలను ప్రారంభించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు చెందిన పోలీస్ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో ఒకే వేదికపై పాల్గొని బతుకమ్మ పాటలు, ఆటలతో సందడి చేశారు. ఎస్పీ మహిళలు, చిన్నారులతో కలిసి బతుకమ్మ ఆడి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అన్నారు. ఇలాంటి వేడుకలు పోలీస్ కుటుంబాల మధ్య ఐక్యత, ఆత్మీయతను పెంపొందిస్తాయన్నారు. పోలీసుల విధి నిర్వహణలో కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి, భైంసా ఏఎస్పీ సాయికిరణ్, నిర్మల్ డీఎస్పీ పి. శ్రీనివాస్, పోలీస్ అధికారులు, సిబ్బంది, షీ టీమ్, భరోసా టీమ్ సభ్యులు, పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చే సదస్సు

కలంజ్యోతి, భారత్ ఫ్యూచర్ సిటీ (అక్టోబర్ 20) : రాష్ట్ర రాజకీయ, ఆర్థిక ముఖచిత్రాన్ని సమూలంగా మార్చే చారిత్రాత్మక వేదికగా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిలవనుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం భారత్ ఫ్యూచర్ సిటీలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, అవసరమైతే కార్మికుల సంఖ్యను మరింత పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే ఏడాది జూన్ నాటికి రతన్ టాటా రేడియల్ రోడ్డు ప్రారంభమే లక్ష్యంగా పనులు సాగాలని నిర్దేశించారు.

సమ్మిట్ ఏర్పాట్లపై సీఎం సమీక్ష..

డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మీ పెట్టుబడులు మాతో సురక్షితం అనే బలమైన భరోసాతో ఈ ప్రతిష్టాత్మక సదస్సును ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలిపారు.

ఈ గ్లోబల్ సమ్మిట్ 2.0ను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోనే నిర్వహించనున్న నేపథ్యంలో, యూనివర్సిటీ నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి సదస్సు ఏర్పాట్లపై పూర్తి దృష్టి సారించాలని అధికార యంత్రాంగానికి స్పష్టం చేశారు.

నవంబర్ చివరి నాటికి సర్వం సిద్ధం..

ఈ ప్రతిష్టాత్మక సదస్సు ఏర్పాట్లకు సంబంధించి అధికారులకు సీఎం స్పష్టమైన గడువు విధించారు. నవంబర్ 15 నాటికి ఓపెన్ ప్రమిసెస్ పనులు, నవంబర్ చివరి నాటికి సమ్మిట్‌కు సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లు సంపూర్ణంగా పూర్తి కావాలని ఆదేశించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. సదస్సు విజయవంతం కోసం ఇప్పటి నుంచే పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

పోలీస్ కమిషనరేట్, నిమ్ ప్రారంభం..

పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ఇబ్రహీంపట్నంలో నూతనంగా నిర్మించిన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌ను ప్రారంభించారు. అనంతరం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయ ప్రాంగణంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (నిమ్) క్యాంపస్‌కు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, ప్రకాష్ గౌడ్, కాలె యాదయ్య, డీజీపీ సీవీ ఆనంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

కొత్తగా మొదలు పెట్టడమే అసలైన శక్తి

పరిస్థితులను తట్టుకుని కొత్తగా జీవితాన్ని మొదలుపెట్టడమే అసలైన శక్తి అని నటి రియా చక్రవర్తి పేర్కొన్నారు. దుర్గా పూజ అంటే కేవలం అమ్మవారిని కొలవడమే కాకుండా, మహిళలు తమలోని అంతర్గత బలాన్ని గుర్తించడమని చెప్పారు. కష్టాల్లో సహాయం కోరడంలో తప్పులేదని, గతాన్ని అంగీకరిస్తూ ముందుకు సాగాలని సూచించారు. మహిళల రక్షణకు బలమైన వ్యవస్థలు అవసరమని, ఇతరుల తీర్పులకు భయపడకుండా సొంత నిర్ణయాలు తీసుకోవడమే నిజమైన స్వేచ్ఛ అని ఆమె స్పష్టం చేశారు.

Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Rudra Kakatiya Printers and Graphics H.no.183/85/12/38, Somidi Road, Kazipet, Warangal, 506003., Published at H.No. 30/1/426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.